క్లుప్తంగా

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ములకలంకకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ చిట్టూరి కృష్ణావతారం పాల్గొని జ్ఞాన బోధ చేశారు. మన జీవితంలో ప్రతిరోజు శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, పరస్పర అవగాహన పాటు మిత్రలాభాన్ని పొందవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, తీడ నాగరాజు, సబ్బారపు వెంకటరావు, కె.మోహన్ కుమార్, సన్నిధి ఉదయ్, మీసాల భవాని, సబ్బారపు కమల, బోళం యర్రాయమ్మ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు



ఆర్ అండ్ బీ రోడ్డుపై భారీ వాహనాలు నిలుపుదల చేసిన దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం నుంచి కాళీపట్నం వెళ్లే ఆర్అండ్ బీ రోడ్డు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాళీపట్నం లాకుల సమీపంలోని అశ్విని రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుపై భారీ కంటైనర్లు నిలుపుదల చేయడంతో రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రోడ్డు నిర్వహణను పట్టించుకోవాల్సిన ఆర్ అండ్ బీ అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో పలువురు వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై భారీ వాహనాలు రోజుల తరబడి నిలపకుండా చూడాలని కోరుతున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వాహన యజమానులు తమతమ వాహనాలకు పూజలు చేయించుకునేందుకు భారీగా రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాస సారె ఆదివారం అంగరంగ వైభవంగా సమర్పించారు. గ్రామంలో ఆర్య వైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో ముందుగా ఆర్యవైశ్య మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి సన్నాయి మేళతాళ వాయిద్యాలతో పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, వివిధ రకాల మిఠాయిలతో పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. రావిచెట్టు సెంటర్‌లో ఉన్న శ్రీ వాసవీ మాత అమ్మవారి ఆలయంలో ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

పేదలకు దుస్తుల అందజేత

నరసాపురం రూరల్: మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్న గుంపుల జనార్ధన్ తల్లి 24వ వర్ధంతి పురస్కరించుకుని మండలంలోని పసలదీవి గ్రామంలో ఆదివారం కుటుంబ సభ్యులు స్థాపించిన సెవెన్ ఆలివ్స్ ట్రస్ట్‌ద్వారా పేదలకు దుస్తులను అందజేశారు. పసలదీవి, పేరుపాలెం, యలమంచిలి, మైజేరు గుంట తదితర గ్రామాలకు చెందిన 150 దుస్తులను అందజేశామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విలియమ్, ఇశ్రాయేలు, వసంత్, రీటా, గ్రేస్, స్టాన్లీ, సాక రాజారావు పాల్గొన్నారు.

దొడ్డిపట్ల పీహెచ్‌సీ వైద్యుడిగా జాన్‌లియో



యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర రెండవ వైద్యాధి కారి డాక్టర్ జాన్‌లియో నియమితులయ్యారు. ఆయన పాలకొల్లు అర్బన్ (వీవర్స్ కాలనీ) పీహెచ్‌సీలో వైద్యాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డాక్టర్ కె.చంద్రరేఖ మొదటి వైద్యాధికారిగా పని చేస్తున్నారు. వీరిరువురిలో ఒకరు పీహెచ్‌సీలో బాధ్యతలు నిర్వహించనుండగా మరొకరు ఫ్యామిలి ఫిజీషియన్ క్యాంపులకు హాజరవుతారు.

రైతులకు అండగా.. ఆర్బీకేలు

- ఆర్బీకేల ద్వారా రైతు ముంగింటకే సేవలు
- రైతన్నకు అండగా నిలుస్తున్న జగనన్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గొరగనమూడి రైతు భరోసా కేంద్రం



పాలకోడేరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సేవలు అందిస్తున్న దృశ్యం

పాలకోడేరు : ఒకప్పుడు అన్నదాతకు సాగులో కష్టాలు, కన్నీళ్లే, దినదిన గండమే. టీడీపీ అధినేత చంద్రబాబు సాగును దండగ అనడమే కాకుండా అలా మార్చారు కూడా. అలాంటి సమయంలో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం సాగులో సిరులు కురిపించింది. వ్యవసాయం రంగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. తద్వారా సాగు బంగారమైంది. ఆర్బీకేల ఏర్పాటుతో పాటు వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతుభరోసా వంటి పథకాలు కొండంత అసరాగా నిలిచాయి. నేడు రైతు ముగింటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలూ అందుతున్నాయి. అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేనున్నాననే భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి నాలుగేళ్లగా రైతు సంక్షేమానికి బాటలు వేస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు అవసరమైన అన్ని సదుపాయాలను రైతుల వద్దకే అందిస్తోంది. సాగులో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలో మొత్తం 18 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల తరఫున తగినంత సిబ్బందిని నియమించారు. వీరు నేరుగా రైతుల వద్దకే వెళ్లి సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నారు. మండల పరిధిలో 11,900 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో పెన్నాడ గోరగనమూడి, వంకాయలపాలెం, గుత్తులవారిపాలెం తదితర గ్రామాల్లో 170 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వరితో పాటు కూరగాయలు తదితర పంటల సాగు జరుగుతుంది.

కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు



గతంలో రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే మండల కేంద్రంలో ఉండే అధికారుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. లేకపోతే అధికారులు గ్రామాలకు వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంబంధిత సిబ్బంది గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉంటున్నారు. అక్కడి నుంచే రైతులకు అవసరమైన అన్ని సేవలను అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులు తప్పాయి.

– చిగురుపాటి సామేలు, మొగల్లు రైతు

ఆర్బీకేలు ఎంతో ప్రయోజనకరం



రైతులకు సాగులో ఎదురయ్యే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఎంతో తోడ్పడుతున్నాయి. తమ గ్రామంలోనే ఏర్పాటైన ఆర్బీకేల వద్దకు వెళ్లి అక్కడ సిబ్బంది తమ సమస్యలను చెప్పుకోవడం ద్వారా సదరు సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మండల కేంద్రంలో ఉండే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్య లేదు.

– ఉండ్రు నాని, కౌలు రైతు, శృంగవృక్షం

దళారులతో పనిలేదు



గతంలో దళారులు చెప్పిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. అయితే మద్దతు ధరను ప్రకటించడంతో పాటు ఆ ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండడంతో ఇప్పుడు రైతులకు మేలు జరుగుతోంది. కొనుగోళ్ల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్ల చేపట్టడంతో అదనపు ప్రయోజనం కలుగుతోంది.

– ఆర్ఎస్ రాజు, మొగల్లు, రైతు

లయన్స్ సేవలు మరింత విస్తృతం చేద్దాం



బాధ్యతలు చేపట్టిన ఉండి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

ఉండి : లయన్స్‌క్లబ్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో ఉండి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. మరో మాజీ గవర్నర్ మేకా శ్రీరామసురేష్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ, కోశాధికారి సాగిరాజు సూర్యకుమారి తదితరులతో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రేపూరి మాట్లాడుతూ సేవలోనే నిజమైన సంతృప్తి మనిషికి లభిస్తుందని అన్నారు. క్లబ్ సేవల ద్వారా ఎంతో మందికి సహాయ సహకారాలు అందించడంతో పాటు ఎన్నో జీవితాలు నిలబెట్టామనే సంతోషం మనకు జీవితాంతం నిలుస్తుదని అన్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో లయన్స్ సేవలు మరింత మెరుగుపరుచుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ దాట్ల రామరాజు, జోనల్ చైర్మన్ కే సత్యనారాయణమూర్తి, మల్లేశ్వరరావు, పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, రాము, జోన్ చైర్మన్ రంగారెడ్డి, నందమూరి రాజేష్, రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, సాగిరాజు సాంబరాజు, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, కలిదిండి పెదఅప్పలరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

జగన్ పాలనలో పండుగలా వ్యవసాయం



మార్టేరు శాస్త్రవేత్తల ద్వారా సత్కారం పొందిన అభ్యుదయ రైతు నంద్యాల చల్లారావు

ఆకివీడు : అన్నదాతల ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరచి, వ్యవసాయం పండుగగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఉండి కేవీకే డైరెక్టర్, అభ్యుదయ రైతు నంద్యాల సీతారామయ్య అన్నారు. రైతు దినోత్సవం పురస్కరించుకుని శనివారం మార్టేరులో శాస్త్రవేత్తలు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా సీతారామయ్య ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలు విప్లవాత్మక మార్పుల్ని తీసుకువచ్చాయన్నారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ దళారుల బెడద లేకుండా చేయడం చరిత్రాత్మకమన్నారు. పల్లెల్లో రైతు భరోసా కేంద్రాలు రైతు ముంగిటకే వచ్చి సేవలందిస్తున్నాయని చెప్పారు. పంట నష్టపరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీకి రైతు రుణాలు వంటివి రైతుకు వెన్నుదన్నుగా నిలిచాయని చల్లారావు చెప్పారు. రానున్న రోజుల్లో సేంద్రియ సాగును వృద్ధి చేసి, చిరు ధాన్యాల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అభ్యుదయ రైతుగా తనను గుర్తించి, సత్కరించిన మార్టేరు శాస్త్రవేత్తలకు, సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బంగారు ఆభరణాల ప్రదర్శన



బంగారు ఆభరణాల ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఆనంద ఇన్‌లో వేగా జ్యూయలరీస్ ఏర్పాటు చేసిన బంగారు ఆభరణాల ప్రదర్శన అమ్మకాలను టూటౌన్ ఏఎస్సై ఎండీ బాబ్జి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆభరాణల కోసం వినియోగదారులు పలు ప్రాంతాలకు తిరగాల్సిన అవసరం లేకుండా దేశంలోని ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే బంగారు ఆభరణాల ప్రదర్శనలో పోల్కి జ్యూయలరీపై మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవన్నారు. ఈ నెల 21న విజయవాడ షోరూంలో లక్కీ డ్రా నిర్వహిస్తామని లక్కీ డ్రాలో 3 డైమండ్ నెక్లెస్‌లు గెలుపొందే అవకాశం ఉందన్నారు. వేగ జ్యూయలరీస్ బ్రాంచ్ షోరూంలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని నగరాలకు విస్తరిస్తామని వారు తెలిపారు.

మెంటేవారితోటలో మావుళ్లమ్మ జాతర ప్రారంభం



మావుళ్లమ్మవారి జాతర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలో ఆషాఢ మాసం సందర్భంగా మెంటేవారి తోట యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మావుళ్ళమ్మ అమ్మవారి జాతర ప్రారంభమైంది. ఈ జాతరను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో స్థానిక శాసన సభ్యులు గ్రంధి శ్రీనివాస్ భీమవరం నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాగా జాతరను పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అమ్మవారి గరగరలతో, శక్తి వేషాలతో ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో ముత్యాల బాబులు, ఇంటి సత్యనారాయణ, ముత్యాల అంజి, కోయ మణి, ముత్యాల ఆయ్యప్ప, యర్రా నాని, ఆటో బాబి, సత్తిపండు, నౌడురి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉపాధ్యాయ సంఘ సమావేశం



ఉపాధ్యాయుల సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని అంకాల ఆర్ట్ అకాడమీలో, జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ , పీఈటీ పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘ సమావేశం సంఘాధ్యక్షుడు బి.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ సంవత్సరం జిల్లా సంఘం తీసుకున్న నూతన నిర్ణయాల గురించి చర్చించారు. ఐఎఫ్‌పీ ట్రైనింగ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయిని వి.భాగ్యలక్ష్మికి రూ.29 వేలను సమకూర్చి అందచేశారు. అనంతరం సంఘ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలరాజు, బి.రవి, టి.చిట్టి, ఎంవీఎస్ మూర్తి, పి.సుబ్బారావు, టి. చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

సాక్షి, భీమవరం: పెరుగుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బలరాం మాట్లాడుతూ జిల్లాలో నిత్యావరసరాలు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో చింతకాయల బాబురావు, కవురు పెద్దిరాజు, పీవీ ప్రతాప్, డి.కల్యాణి, బి.వాసు దేవరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసుధామకు ఘన సన్మానం

పెనుగొండ: పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన కొడమంచిలి పెదపేటకు చెందిన జిల్లెళ్ల సత్య సుధామను ఆచంట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సుంకర ఇందిర ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు స్థానిక లూథరన్ చర్చిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యసుధామ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక పెదపేటలోని ఉత్తమ విద్యార్థులకు ఆమె నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, సంఘపెద్దలు యెల్లమెల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ వద్దంటూ నిరసన

నరసాపురం రూరల్: పట్టణంలోని మాలెం వీధి గ్యాస్ గొడౌన్ సమీపంలో నివాసిత ప్రాంతాల మధ్య నిర్మిస్తున్న ఓ సెల్ టవర్ నిర్మాణాన్ని ఆ ప్రాంత వాసులు అడ్డుకున్నారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబందించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక 20వ వార్డుకు చెందిన ఈ ప్రాంతంలో హడావిడిగా ప్రారంభించిన సెల్ టవర్ నిర్మాణ పనులను పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు అడ్డుకున్నారు. చుట్టూ నివాసాలు ఉండగా మధ్యలో సెల్ టవర్ నిర్మాణానికి ఎవరు అనుమతి ఇచ్చారంటూ కౌన్సిలర్ వంగా శ్రీకాంత్‌కన్నా అక్కడున్న వారిని ప్రశ్నించారు. ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ నినాదాలు చేశారు. ప్రజలు వచ్చి ప్రశ్నించడంతో టవర్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇదే విషయమై సోమవారం స్పందనలో పిర్యాదు చేస్తామని కౌన్సిలర్ తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాబ్జి, పులపర్తి కుమార్‌రాజు, రాజు, వాకా పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మహదేవపట్నంలో జగనన్న సురక్ష

ఉండి : మహదేవపట్నం గ్రామంలోని రెండు సచివాలయాల్లోను మంగళవారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవా అప్పారావు తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

వాసవీమాతకు సారె సమర్పణ



వాసవి మాతకు సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక త్యాగరాజు భవన్‌లో ఉన్న శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారికి గునుపూడి వాసవీ క్లబ్ సభ్యులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి సారె, పసుపు, కుంకుమను సమర్పించామని తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

పాలకోడేరు : కుమార్తె కనిపించడం లేదని ఓ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన బి.అశ్రిత ఈనెల 8వ తేదీన రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి గీతాకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కె.బాలవంశీకుమార్ అనే యువకుడిపై తనకు అనుమానం ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధ్యాత్మిక సేవలు విస్తృత పరచాలి



ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ని శాలువాతో సత్కరిస్తున్న పెదగోపురం పాలకవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ది చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సేవలు విస్తృత పరచడంతో పాటు ఆలయ ఆస్తులను కాపాడడంలో ట్రస్టీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా రెండోసారి నియమితులైన కోరాడ శ్రీనివాసరావు, ట్రస్టీలు పొత్తూరి పద్మ, తాతపూడి రామలింగేశ్వర శర్మ, చింతా కాత్యాయిని, ముంగండ అన్నవరం, నీలంశెట్టి సత్యప్రసాద్, యాళ్ల వరలక్ష్మి, తరపట్ల విజయలక్ష్మి, కాండ్రేకుల రాజేశ్వరి, సన్నిధిరాజు రామకృష్ణప్పలను ఎమ్మెల్సీ శ్రీనివాస్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయంలో సేవలు అందించాలన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలన్నారు. దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు.

బాధితులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్య, వైద్యం నిమిత్తం ఆర్థిక ఇబ్బందులతో ఎదురుచూస్తున్న పలువురుకి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక కుళాయి చెరువుగట్టు వద్ద క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు గుండె వ్యాధి బాధితుడు కుంపట్ల శ్రీనివాస్‌కు రూ. 10 వేలు, ఇద్దరు విద్యార్థులకు రూ. 9 వేలు విలువైన పుస్తకాలు, లివర్ వ్యాధితో బాధపడుతున్న 2 ఏళ్ల చిన్నారికి రూ. 6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిస్సహాయులను ఆదుకోవడంలో ఉన్న ఆనందం ఎందులోనూ రాదని సుధాకరరావు అన్నారు. అనంతరం వాకింగ్ చేసిన సభ్యులకు రాగి జావ, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు.

జగనన్న కాలనీలో వేగంగా అభివృద్ధి పనులు



గొల్లవానితిప్పలోని కాలనీలో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



వేగంగా నిర్మాణమవుతున్న ఓహెచ్ఆర్ ట్యాంకు పనులు



వీధిలైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

రూ. 2 కోట్లతో ఓహెచ్ఆర్, రోడ్ల నిర్మాణాలు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో 18 ఎకరాల్లోని జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. కనీస వసతులైన రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చేందుకు ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జగనన్న కాలనీలో మొత్తం 520 ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారం చేపట్టగానే అర్హులైన లబ్ధిదారులకు 165 ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. వీటిలో 42 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారం చేపట్టగానే జగనన్న కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గృహాలు నిర్మించునేవారికి సత్వరమే బిల్లులు మంజూరు చేయడంతో 165 మంది లబ్ధిదారులకు 42 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. అంతేకాకుండా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. గత మూడు నెలలు క్రితం రూ. 10 లక్షలతో వీధి లైట్లు ఏర్పాటు చేశారు.

సుమారు రూ. 2 కోట్లతో అభివృద్ధి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించి జగనన్న కాలనీకి స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు రూ. కోటి 46 లక్షలతో ఓహెచ్ఆర్ ట్యాంకు, పైపులైన్‌లు, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఆ పనులు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా అంతర్గత రోడ్లపై గ్రావెల్ వేయడానికి సుమారు రూ. 60 లక్షలతో అంతర్గత రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్లు, ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ జగనన్న కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తోనే అభివృద్ధి సాధ్యం



గతంలో ఈ కాలనీలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం, తాగు నీరు అందిచడం వంటి కనీస మౌలిక వసతులపై దృష్టి పెట్టలేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో సుమారు రూ. 2 కోట్లతో రోడ్లు, ఓహెచ్ఆర్ ట్యాంకు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారు. కాలనీ అభివృద్ధి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తోనే సాధ్యమైంది.

– చిల్లే వెంకటేష్, సర్పంచ్, గొల్లవానితిప్ప